నేడు అంతర్వేదిలో స్వామివారికి చక్రస్నానం

రేపు ఉమ్మడి జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు

కాయ్ రాజా కాయ్



- అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లనే దానిపై అప్పుడే బెట్టింగ్‌ల జోరు
- టీడీపీ, జనసేన కూటమి విజయం వైపు అత్యధికంగా పందెరాయుళ్లు మొగ్గు
- జిల్లాలో ఏడింటికిగాను అయిదు సీట్లు ఖాయమంటూ లక్షల్లో బెట్టింగ్‌లు
- వైసీపీకి వచ్చే సీట్లపై పెద్దగా మొగ్గుచూపని బెట్టింగ్ రాయుళ్లు
- మరోపక్క జిల్లాలో జనసేన పోటీచేసే స్థానాలపై పోటాపోటీ బెట్టింగ్‌లు
- అత్యధికంగా పిఠాపురం సీటుపై కోట్లు దాటేసిన పందేలు
- రెండింట్లో ఎవరు బరిలో ఉంటారంటూ చెరో రూ.కోటితో ఓ రెండు గ్రూపుల పందేలు
- వైసీపీ ఎంపీ అభ్యర్థి సునీల్ జాతకంపైనా పోటాపోటీ బెట్టింగ్‌లు



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అప్పుడే పందెంరాయుళ్లు స్పీడు పెంచారు. జిల్లాలో టీడీపీ, వైసీపీలో ఏ పార్టీ ఎన్ని సీట్లు గెలుచుకుంటుందనే దానిపై కోట్లలో బెట్టింగ్‌లు మొదలుపెట్టారు. వైసీపీ ప్రభుత్వంపై విపరీతమైన ప్రజావ్యతిరేక నెలకొనడం, అటు టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమంటూ సర్వేలు స్పష్టం చేస్తుండడంతో బెట్టింగ్ రాయుళ్లు పోటాపోటీగా పందేలు కాస్తున్నారు. జిల్లాలో కూటమికి ఏడు సీట్లకుగాను అయిదు ఖాయమంటూ నియోజక వర్గాల్లో కోట్లలో బెట్టింగ్‌లు అప్పుడే మొదలయ్యాయి. అయితే బటన్ నొక్కుడు పథకాలు తమను గెలిపిస్తాయని అధికార పార్టీ నేతలు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా వైసీపీ గెలుపుపై మాత్రం పందేలు కాయడానికి పెద్దగా బెట్టింగ్ రాయుళ్లు ఆసక్తి చూపడం లేదు. అలాగే జిల్లాలో జనసేన పార్టీ పోటీచేసే స్థానాలు ఎన్ని? అవేవి? అనేదానిపై భారీగా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. ప్రధానంగా పిఠాపురం సీటు నుంచి టీడీపీ, జనసేనలో ఏ పార్టీ బరిలో ఉంటుందనేదానిపై కోట్లలో బెట్టింగ్‌లు జరుగు తున్నాయి. తాజాగా ఓ రెండు గ్రూపులు చెరో కోటితో ఓ రైసుమిల్లు కేంద్రంగా పందేలకు సిద్ధమయ్యాయి. కాకినాడ వైసీపీ ఎంపీ అభ్యర్థి సునీల్‌పైనా బెట్టింగ్‌లు హోరెత్తుతున్నాయి. ఈయన విజయావకాశాలపై భారీగా పందేలు కాస్తున్నారు.

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. అధికార, ప్రతిపక్షాలు పోటాపోటీగా ఎన్నికల ప్రచారాలు చేస్తున్నాయి. షెడ్యూల్ రాకముందే పార్టీల అధినేతల దగ్గర నుంచి నియోజకవర్గాల్లో అభ్యర్థుల వరకు ప్రచారాలు ముమ్మరం చేస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా ఎన్నికల సందడి కనిపిస్తోంది. ఈ తరుణంలో బెట్టింగ్‌రాయుళ్లు సైతం జోరుగా పందేలు మొదలుపెట్టారు. ఈ దఫా ఎన్నికల్లో జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయనేదానిపై బెట్టింగ్‌లు పెద్దఎత్తున కాస్తున్నారు. ప్రధానంగా అధికార వైసీపీపై ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉండడం, టీడీపీ-జనసేన పొత్తుతో ఎన్నికల బరిలోకి దిగుతుండడంతో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులన్నీ టీడీపీ, జనసేన కూటమికి అనుకూలంగా ఉండడం, ఇప్పటికే అనేక సర్వేలు టీడీపీ కూటమివైపే మొగ్గుచూపడంతో బెట్టింగ్‌లు హోరెత్తుతున్నాయి. ఈసారి వైసీపీకి ఓటమి ఖాయమని, టీడీపీ, జనసేన కూటమి ఎక్కువ సీట్లు గెల్చుకుంటాయంటూ జిల్లాలో పందెంరాయుళ్లు లక్షల నుంచి కోట్ల వరకు బెట్టింగ్‌లు వేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో ఏడు సీట్లకుగాను అయిదు సీట్లు టీడీపీ కచ్చితంగా గెల్చుకుంటుందంటూ బెట్టింగ్‌లు ఎక్కువగా నడుస్తున్నాయి. ఎక్కడికక్కడ ఇరుపార్టీల్లో కొందరు నేతలు, కార్యకర్తలు, బయట వ్యక్తులు తమ సర్కిళ్లలో పందేలను పెద్దఎత్తున కాస్తున్నారు. టీడీపీ కూటమి అయిదు సీట్లు సాధిస్తుందని గ్రామస్థాయిలో లక్ష, పట్టణాలు, జిల్లా కేంద్రం స్థాయిలో రూ.5 లక్షల నుంచి అరకోటి, కోటీ వరకు పందేలు మొదలయ్యాయి. అయితే వైసీపీకి పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో టీడీపీ కూటమివైపు పందేలు కాసేవారు ఎక్కువగా ఉంటున్నారు. కొందరు వైసీపీ నేతలు మాత్రం ఎక్కువ సీట్లు తమకే వస్తాయంటూ లక్షల్లో బెట్టింగ్‌లు వేస్తున్నారు. పెద్దమొత్తంలో పందేలకు మాత్రం వెనకడుగు వేస్తున్నారు. మరికొన్ని నియోజకవర్గాల్లో వైసీపీని అసలు పరిగణనలోకి తీసుకోకుండా టీడీపీ కూటమి గెలుచుకునే సీట్లు ఎన్ని అనేదానిపై పందేలు కడుతున్నారు. అలాగే పొత్తులో భాగంగా జిల్లాలో జనసేన ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుంది? ఆ సీట్లు ఏవి అనేదానిపై బెట్టింగ్‌లు పెద్దఎత్తున కాస్తున్నారు. రెండు అసెంబ్లీ, ఎంపీ స్థానం, ఎంపీ స్థానం, ఒక అసెంబ్లీ వీటిలో ఏది ఖాయం అనేదానిపై బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. అయితే వీటిలో ప్రధానంగా పిఠాపురం సీటుపై బెట్టింగ్‌లు అప్పుడే కోట్లు దాటేశాయి. ఈ సీటు నుంచి ఎవరు బరిలో ఉంటారనే దానిపై పందెం రాయుళ్లలో ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో టీడీపీకా, జనసేనకా అనేదానిపై కోట్లలో పందేలు కడుతున్నారు. ఇటీవల ఈ సీటు రెండింట్లో ఎవరుంటారనేదానిపై రెండు గ్రూపులు చెరో కోటితో పందేలకు సిద్ధమయ్యాయి. పిఠాపురంలో ఓ రైసుమిల్లు యజమాని మధ్యవర్తిగా డబ్బులు డిపాజిట్ చేసేందుకు పోటీపడ్డాయి. అలాగే కాకినాడ వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న చలమశెట్టి సునీల్ విజయావకాశాలపైనా పోటాపోటీ బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఈయన మూడుసార్లు ఓటమిపాలైన నేపథ్యంలో ఈ దఫా నాలుగోసారి ఫలితం ఎలా ఉంటుంది? అనేదానిపై రెండు గ్రూపులు కోట్లలో పందేలు కాశాయి. ఈ దఫా కచ్చితంగా ఒడ్డెక్కుతారని కొందరు, కూటమి ప్రభావమే ఎక్కువగా ఉంటుందని మరికొందరు పోటాపోటీగా బెట్టింగ్‌లు వేస్తున్నారు.

జిల్లాలో డిప్యూటీ తహశీల్దార్ల బదిలీలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23: సార్వత్రిక ఎన్నికలు-2024లో భాగంగా కాకినాడ జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తయిన డిప్యూటీ తహశీల్దార్లను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా బదిలీ చేశారు. ఈమేరకు కలెక్టర్ శుక్రవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. గొల్లప్రోలు డిప్యూటీ తహశీల్దార్ ఎం.వీరాస్వామిని పిఠాపురం సీఎస్‌డీటీగా, పిఠాపురం సీఎస్‌డీటీ ఎస్‌కే ఇస్మాయిల్‌ను గొల్లప్రోలు డిప్యూటీ తహశీల్దార్‌గా బదిలీ చేశారు. కాకినాడ అర్బన్ డిప్యూటీ తహశీల్దార్ పీవీ సీతాపతిరావును యు.కొత్తపల్లి డిప్యూటీ తహశీల్దార్‌గా, యు.కొత్తపల్లి డిప్యూటీ తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావును కాజులూరు డిప్యూటీ తహశీల్దార్‌గా, సామర్లకోట డిప్యూటీ తహశీల్దార్ ఆర్. శ్రీనివాస్‌ను కాకినాడ అర్బన్ ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్‌గా, కాజులూరు డిప్యూటీ తహశీల్దార్ జి.దుర్గాప్రసాద్‌ను కాకినాడ రూరల్ ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్‌గా బదిలీ చేశారు. కాకినాడ రూరల్ డిప్యూటీ తహశీల్దార్ కేఎల్ సురేష్‌కుమార్‌ను సామర్లకోట డిప్యూటీ తహశీల్దార్‌గా, కాజులూరు డిప్యూటీ తహశీల్దార్ పి.సుబ్బారావును కోటనందూరు డిప్యూటీ తహశీల్దార్‌గా, సామర్లకోట డిప్యూటీ తహశీల్దార్ ఆర్‌వీఎస్ ఎంఎస్ పవన్‌కుమార్‌ను కాకినాడ అర్బన్ డిప్యూటీ తహశీల్దార్‌గా, కాకినాడ అర్బన్ సీఎస్‌డీటీ డీవీ మురళీకృష్ణను యథావిధిగా కాకినాడ అర్బన్ సీఎస్‌డీటీగా, కోటనందూరు సీఎస్‌డీటీ ఎస్.కిరణ్‌కుమార్‌ను తుని, తొండంగి, కోటనందూరు సీఎస్‌డీటీగా బదిలీ చేశారు. బదిలీ అయిన డిప్యూటీ తహశీల్దార్లు తమకు కేటాయించిన చోట్ల వెంటనే జాయిన్ కావాలని జిల్లా కలెక్టర్ ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి23: మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రంలో జరుగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు కాకినాడ జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు హాల్‌టిక్కెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణం కల్పించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. అన్ని పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో మాత్రమే ఈ సౌకర్యం ఉపయోగించుకోవాలన్నారు. ఈ అవకాశం పరీక్ష జరిగే రోజుల్లో విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.



విలేకరుల సమావేశంలో సుజయకృష్ణ రంగారావు, చినరాజప్ప, చిక్కాల

టీడీపీ, జనసేన కూటమి క్లీన్‌స్వీప్ తథ్యం

పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు సుజయ కృష్ణ రంగారావు

సామర్లకోట, ఫిబ్రవరి 23: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన కూటమి క్లీన్‌స్వీప్ చేస్తుందని, ఇది తథ్యమని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు స్పష్టంచేశారు. సామర్లకోట మండలం అచ్చంపేటలోని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వగృహంలో శుక్రవారం సాయంత్రం కాకినాడ పార్లమెంటరీ పరిధిలోని అసెంబ్లీ సిగ్మెంట్ల నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో పార్టీ సంస్థాగత కార్యక్రమాలు మరింత ముమ్మరం చేస్తామన్నారు. ఎన్నికల పొత్తులో భాగంగా సీనియర్లకు టిక్కెట్లు ఉండవనే అపోహ వద్దని, టిక్కెట్లు రాని వారికి సైతం పార్టీలో సముచిత స్థానం కల్పించేలా చంద్రబాబు న్యాయం చేస్తారన్నారు. స్థానిక బలాబలాలు, సామాజిక సమీకరణాల ఆధారంగా పోటీచేసే అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఎవరికి వారే సీట్లు తమవే అని ప్రకటించుకునే పరిస్థితి ఉండదన్నారు. ప్రజావ్యతిరేక ప్రభుత్వంలో నియంతగా వ్యవహరిస్తున్న జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం రాష్ట్రానికి చారిత్రక అవసరంగా అందరూ గుర్తించాలని కోరారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ పొత్తుల వల్లే పోటీచేసే అభ్యర్థుల పేర్లను ప్రకటించడం జాప్యం అవుతోందన్నారు. పొత్తులో భాగంగా సీటు ఎవరికి ఇచ్చినా పనిచేసేందుకు ఇరుపార్టీల నేతలు సిద్ధంగా ఉన్నారని, అయితే అభ్యర్థులను త్వరితగతిన ప్రకటించాలని పార్టీ పరిశీలకుడి ద్వారా చంద్రబాబుని కోరుతున్నానని చినరాజప్ప చెప్పారు.

మూడు నెలలుగా అష్టకష్టాలు

- ఎంపీఈవోలకు అందని వేతనాలు
- అప్పులు చేస్తూ జీవనం సాగిస్తున్న వైనం
- వచ్చే నెల 31తో ముగియనున్న కాంట్రాక్టు గడువు
- ఆందోళనలో ఎంపీఈవోలు

పెద్దాపురం, ఫిబ్రవరి23: బహుళ ప్రయోజన విస్తరణాధికారులు (ఎంపీఈవో)లకు తిప్పలు తప్పడం లేదు. సుమారు మూడు నెలలుగా వేతనాలు అందక అష్టకష్టాలు పడుతూ జీవనం సాగిస్తున్నారు. రైతుభరోసా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ, అనుబంధ శాఖల సేవలు విస్తరిస్తూ రైతులకు సాగులో మెలకువలు చెబుతుంటారు. వేతనాల కోసం అధికారులను అడగలేక, ఆందోళనలు చేపట్టలేక ఎప్పటికైనా వేతనం వస్తుందన్న నమ్మకంతో అప్పులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఏకంగా గడచిన నవంబరు నుంచి మూడు నెలల వేతనాలు ఇవ్వలేదని తెలుస్తోంది. మరో పది రోజులు గడిస్తే సుమారు నాలుగు నెలలు పూర్తవుతుంది. దీనికితోడు ఎంపీఈవోల కాంట్రాక్టు గడువు ఈ ఏడాది మార్చి 31తో ముగియనుంది. దీంతో వారు మరింతగా ఆందోళన చెందుతున్నారు. తమను మళ్లీ కొనసాగిస్తారా లేదా అనే సందేహంతో కాలం వెళ్లదీస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సాగు సేవలను విస్తరించాలనే లక్ష్యంతో గ్రామస్థాయిలో బహుళ ప్రయోజన విస్తరణాధికారుల పేరుతో ఎంపీఈవోలను నియమించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంపీఈవోలను గాలికొదిలేసింది. గ్రామస్థాయిలో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి వ్యవసాయ, పట్టు, ఉద్యానశాఖలకు సంబంధించి గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించింది. పూర్తిస్థాయిలో పోస్టులు భర్తీకాకపోవడంతో 28 మంది ఎంపీఈవోలను రైతు భరోసా కేంద్రాల సహాయకులుగా నియమించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎంపీఈవోల విధులు ఒక్కటే అయినప్పటికీ ఎంపీఈవోలకు వేతనం తక్కువ. అదీ ఎప్పుడొస్తుందో తెలియని దుస్థితి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా ఉండగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 252 మంది ఎంపీఈవోలను నియమించింది. వారిలో సుమారు 224 మంది గ్రామ వ్యవసాయ సహాయకులుగా నియమితులుకావడంతో 28 మంది మిగిలిపోయారు. వీరికి వేతనంగా నెలకు రూ.12 వేతనం, రూ.మూడు వేలు ఇన్సెంటివ్ కలుపుకుని రూ.15 వేల వేతనం అందుతోంది. వీరిలో కొంతమంది సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మారుమూల ప్రాంతాల్లో తమ విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి సకాలంలో వేతనాలు అందకపోవడంతో ఇప్పుడు అష్టకష్టాలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వేతనాలు ఇప్పటికైనా చెల్లించాలని ఎంపీఈవోలు వేడుకుంటున్నారు.



కాకినాడ నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా చేపట్టిన దృశ్యం

రైతులపై కాల్పులను ఖండిస్తూ నిరసన ధర్నా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23 : రైతు పండించిన పంటలకు మద్దతు ధర చట్టం తేవాలని, మోదీ రైతులకిచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని, ఆ ఉద్యమంలో మరణించిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రెండవ దఫా రైతాంగం ఢిల్లీ సరిహద్దుల్లో చేపట్టిన ఉద్యమకారులపై హర్యానా బీజేపీ ప్రభుత్వం పోలీసులతో కాల్పులు జరిపించడం హేయమైన చర్య అని రైతు, కేంద్ర కార్మిక సంఘాలు ఖండించాయి. శుక్రవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో కాకినాడ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు, సామాజిక కార్యకర్త దూసర్లపూడి రమణ రాజు ప్రసంగించారు. బీజేపీ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు.

ఉద్యోగ నియామకంపై విచారణకు కమిటీ

జీజీహెచ్ (కాకినాడ)ఫిబ్రవరి 23 : కాకినాడ జీజీహెచ్‌లో అడ్డదారిలో ఉద్యోగ నియామకం పొందాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై త్రిసభ్య విచారణ కమిటీని ఏర్పాటుచేస్తూ కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీజీహెచ్‌లో గ్రేడ్-2 మెకానిక్‌గా ఉద్యోగం చేస్తున్న సురేంద్రరాజుపై అడ్డదారిలో ఉద్యోగం సంపాదించాడన్న ఆరోపణలే కాకుండా తాను పనిచేసే చోట అవినీతికి పాల్పడ్డాడన్న ఫిర్యాదులు అందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆసుపత్రి సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ పుష్కరరావు, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు, సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ నూకల శ్రీనివాస్‌లను కలెక్టర్ త్రిసభ్య కమిటీగా నియమించినట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ తెలిపారు. వారం రోజుల వ్యవధిలో అవినీతి ఆరోపణలకు సంబంధించిన నివేదికను తయారుచేసి జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్టు సూపరింటెండెంట్ పేర్కొన్నారు.



గొల్లప్రోలు పోలీసు స్టేషన్ వద్ద బాధితులు

బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని
రూ.కోటికి పైగా టోకరా

- రూ.2 లక్షల రుణం తీసుకుని రూ.50 వేలు మాత్రమే ఇచ్చారు..
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 23: బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని చెప్పి వారి పేరున రుణాలు తీసుకుని కొంత సొమ్ము ముట్టచెప్పి కోటి రూపాయలకుపైగా టోకరా వేసిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. ఇలా మోసపోయిన గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన బాధితులు జిల్లా కలెక్టరు ఎస్పీ, పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ విచారణ చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన బందిన భవానీ, లోడా పద్మ, కమ్మర గన్ని, బందిలి నాగరత్నం, చిన్నం అన్నవరం, మంగం వసంత, కుంచే ముని, సత్యవతి, చిన్నం నాగేశ్వరీ, కుంచే సత్యవతి, సంధ్య తదితరుల వద్దకు అదే గ్రామానికి చెందిన చిన్నం అన్నవరం అనే వ్యక్తి వచ్చి పిఠాపురం పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో రుణాలు ఇప్పిస్తానని చెప్పాడు. బ్యాంకు వద్దకు తీసుకువచ్చి చిన్నిని పరిచయం చేశాడు. చిన్ని ఈ మహిళలు వద్ద నుంచి ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లు, ఫోటోలు తీసుకుని వారిని వేర్వేరు గ్రూపుల్లో సభ్యులుగా చేర్చి బ్యాంకు రుణపత్రాలపై సంతకాలు చేయించుకుంది. రుణం ఎంత తీసుకున్నారు, ఎంత చెల్లించాలనే వివరాలు చెప్పకుండా తమలో కొందరికి రూ.50 వేల వంతున ఇచ్చినట్టు మహిళలు తెలిపారు. ఈ విధంగా డబ్బులు తీసుకున్న వారు చిన్నికి వాయిదాల సొమ్మును ఫోన్‌పే ద్వారా చెల్లించారు. అయితే ఇప్పుడు బ్యాంకు ఆఫ్ బరోడా అధికారులు వచ్చి మీరు ఒక్కొక్కరు రూ.2 లక్షల రుణం తీసుకున్నారు, వాయిదాలు కూడా చెల్లించడం లేదు, మొత్తం కట్టాలని చెప్పడంతో వీరు తాము మోసపోయినట్టు గుర్తించారు. తాము రూ.50 వేలు మాత్రమే తీసుకున్నామని కొందరు, తమకు అసలు రుణమే ఇవ్వలేదని మరికొందరు బ్యాంకు అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. మీరంతా మీ గ్రూప్‌లతో ఫోటో తీసుకుని ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. దీంతో తాము చిన్నం అన్నవరం, చిన్నిలను ప్రశ్నించగా సమాధానం చెప్పకపోగా, తిరిగి తమపై దాడికి ప్రయత్నించినట్టు మహిళలు చెప్పారు. ఇప్పటికే మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారిని వేర్వేరు గ్రూపుల్లో చేర్చి చిన్ని రుణాలను వారి పేరున పొందినట్టు తెలుస్తోంది. చేబ్రోలుతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు మండలాలుకు చెందిన పలువురు మహిళలు ఈ విధంగా మోసపోయినట్టు చెబుతున్నారు. ఈ విధంగా స్వాహా చేసిన రూ.కోటికి పైగా ఉంటుందని సమాచారం. మోసపోయిన మహిళలు జిల్లా ఎస్పీ, కలెక్టరులను కలిసి ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. దీనిపై ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ బాధిత మహిళలతో పాటు వెలుగు సిబ్బందిని శుక్రవారం రాత్రి విచారించారు. ఇందులో బ్యాంకు అధికారుల పాత్రపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. బాధిత మహిళలు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

తీరు మారదు..
నీరు పారదు

- దాళ్వా వరి సాగు గట్టెక్కేదెలా..
- సామర్లకోట మండలంలోని రైతుల్లో దిగులు
- నెర్రలు తీస్తున్న వరి పొలాలు
- నేడు అధికారుల పరిశీలన

సామర్లకోట, ఫిబ్రవరి 23: చెంతనే గోదావరి జలాలు.. అదీ కాలువ వెంబడి సామర్లకోట మండలంలో ఉన్న పలు గ్రామాల్లో దాళ్వా వరి పొలాలకు సాగునీరందకపోవడంతో దాళ్వా సాగును గట్టెక్కించేదెలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేల వరకూ పెట్టుబడులు పెట్టిన రైతులు ఇంకా పంట చేతికందాలంటే మరో 40 రోజులపైబడి ఎదురుచూడాల్సి ఉంది. ఇంకా ఎండలు ముదరకముందే కాలువల్లో నీటి విడుదల తగ్గి కాలువ శివారు పొలాలకే కాకుండా కాలువ వెంబడి పొలాలకు సైతం సాగునీరందక నెర్రలు తీశాయి. ఈనెల 17న వెంకటకృష్ణారాయపురం లాకుల వద్ద వీకె రాయపురం, మాధవపట్నం, బోయినపూడి, రామేశ్వరం తదితర రమణయ్యపేట గ్రామాలకు చెంది సుమారు 3 వేల ఎకరాల్లో దాళ్వా వరి సాగుచేసిన రైతులు పురుగుమందు డబ్బాలు చేతబట్టి రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో జిల్లా అధికారులు స్పందించి నీటి విడుదల పెంచేందుకు అంగీకరించారు. కానీ అది కేవలం రెండు రోజులకే పరిమితం అయ్యింది. ఈనెల 20 నుంచి నీటిఎద్దడి తిరిగి యథాతథంగా మారింది. దీంతో రైతులు ఏం చేయాలో తెలియక కలవరం చెందుతున్నారు. ఉన్నతాధికారులు ఎన్నికల ఏర్పాట్ల సమీక్షల్లోనూ రాజకీయపార్టీల నాయకులు తమకు సీటు ఖరారుకోసం తిప్పలు పడుతూ రైతుల సమస్యను గాలికొదిలారన్న ఆరోపణలు రైతుల నుంచి వినవస్తున్నాయి. సామర్లకోట గోదావరి కాలువ అయిన తూర్పు డెల్టా కాలువకు రోజుకు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నప్పటికీ సామర్లకోటకు చేరేసరికి కేవలం 500 క్యూసెక్కులు మాత్రమే అందుతోంది. దీంతో కాలువ శివారు పొలాలకే కాదు.. కాలువ పక్కన పొలాలకు కూడా సాగునీరు అందని పరిస్థితి ఉంది. మరోపక్క ఎండలు ముదురుతుండడంతో సహజంగానే నీటి తడులు అవసరం అధికంగానే ఉంది. దీనికితోడు వంతులవారీ నీటి వినియోగం 15 రోజులకొకసారి అమలుచేయడం వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. వారం రోజులకొకసారి వంతు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని నాటి రైతుల ధర్నా నిరసన కార్యక్రమాల్లో ఇరిగేషన్, వ్యవసాయ అధికారులకు విన్నవించినా ఏమాత్రం ఫలితం లేకపోయిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ సూచనలకు విరుద్ధంగా బొండాలరకం వరి విత్తనాలను అధిక శాతం రైతులు సాగుచేయడం వల్లే ప్రభుత్వం రైతుల ఆవేదనని పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు రైతుల నుంచి వినవస్తున్నాయి. దాళ్వా వరిసాగును ప్రోత్సహించిన వ్యవసాయాధికారులు తాము సాగునీటి కోసం అష్టకష్టాలు పడుతుంటే ఏమాత్రం పట్టించుకోవడం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా నీటిఎద్దడి పరిస్థితిని పరిశీలించేందుకు శనివారం అధికారుల బృందం పర్యటించనున్నట్టు తెలిసింది.



వెంకటకృష్ణరాయపురంలో వరి పొలాలకు సాగునీరు అందక నెర్రలు తీసిన దృశ్యం



సిద్ధార్థనగర్ వద్ద పోలీసులకు, స్థానికులకు మధ్య వాగ్వాదం

స్వగ్రామంలోనే కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి

దళితుల నిరసన సెగ

- గోపాలపురంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఎమ్మెల్యే తన తండ్రి పేరు పెట్టడంపై దళితుల ఆగ్రహం
- ఒక పక్క దళితుల ఆందోళన.. మరోపక్క పోలీసు బందోబస్తు నడుమ పాఠశాల ప్రారంభోత్సవం - 6లో

స్వగ్రామంలోనే కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి

దళితుల నిరసన సెగ

- ఒక పక్క దళితుల ఆందోళన..
- మరోపక్క పోలీసు బందోబస్తు నడుమ పాఠశాల ప్రారంభోత్సవం
- ఎమ్మెల్యే దండ వేసిన అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం
- జగ్గిరెడ్డి దౌర్జన్యం నశించాలంటూ ఫ్లెక్సీ ఏర్పాటు



గోపాలపురం సిద్ధార్థనగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దౌర్జన్యం నశించాలంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన తెలుపుతున్న మహిళలు

రావులపాలెం, ఫిబ్రవరి 23: కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి తన స్వగ్రామంలోనే దళితుల నుంచి నిరసన సెగ తగిలింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు, గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇందులో భాగంగా సిద్ధార్థ నగర్‌వద్ద అవంతి ఫ్యాక్టరీ యజమాన్యం సమకూర్చిన నిధులతో నిర్మించిన ఎంపీపీ పాఠశాలకు జగ్గిరెడ్డి తండ్రి చిర్ల సోమసుందరరెడ్డి పేరు పెట్టడాన్ని ఆ ప్రాంతవాసులు వ్యతిరేకించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దౌర్జన్యం నశించాలంటూ ఫ్లెక్సీ ఏర్పాటుచేసి దళితులు నిరసన తెలిపారు. ఆ సమయంలో జగ్గిరెడ్డి అక్కడకు వచ్చారు. గతంలో అన్నపూర్ణ హోటల్‌లో అంబేడ్కర్ బొమ్మతో ఉన్న ప్లేట్ల వివాదంలో అమాయకులైన దళితులను జైలుకు పంపి ఇప్పుడు ఇక్కడికి ఎలా వచ్చారంటూ జగ్గిరెడ్డిని మహిళలు నిలదీశారు. ఒకపక్క నిరసనలు కొనసాగుతుండగానే మరో పక్క జగ్గిరెడ్డి అవంతి ఎండీ ఇంద్రకుమార్‌తో కలిసి పోలీసు బందోబస్తు నడుమ పాఠశాల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముందుగా అక్కడే ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జగ్గిరెడ్డి పూలమాల వేశారు. అంబేడ్కర్‌ను అవమానించిన వారిని సమర్థించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అమాయకులైన దళిత యువకులను జైలుకు పంపి ఇప్పుడు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేయడం ఏమిటంటూ మరోమారు వివాదం తలెత్తింది. దీంతో పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కార్యక్రమం అనంతరం జగ్గిరెడ్డి అక్కడి నుంచి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించేందుకు గ్రామంలోకి వెళ్లారు. సిద్ధార్థనగర్ యువకులు అంబేడ్కర్‌కు జగ్గిరెడ్డి వేసిన పూలదండలను తీసివేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దళితులను అక్రమ కేసులో ఇరికించి జైలుపాలు చేసినప్పుడు అంబేడ్కర్ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించా రు. ఎంపీపీ పాఠశాలకు సోమసుందరరెడ్డి పేరును వ్యతిరేకిస్తున్నామన్నారు. అంబేడ్కర్ పేరు పెట్టాలని శాంతియుతంగా నిరసన చేపట్టామన్నారు. వివాదం జరిగే అవకాశం ఉందనే సమాచారంతో జగ్గిరెడ్డి నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలను భారీగా సమీకరించారని తెలిసింది.



సిద్ధార్థనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహిళల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

జగన్ మాదిగలను విస్మరించారు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

రావులపాలెం, ఫిబ్రవరి 23: ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉంటానని ఇడుపులపాయ సాక్షిగా మాటిచ్చి ఓట్లు వేసి గెలిపించిన అనంతరం జగన్ మాదిగలను విస్మరించారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. రావులపాలెంలోని కాపు కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజశేఖరరెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ వర్గీకరణకు పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. ఆయన మాట ఇస్తే కట్టుబడి ఉండేవారన్నారు. సీఎం జగన్‌కి తండ్రిలోని మంచి లక్షణాల్లో ఒక్కటి కూడా లేవన్నారు. అందుకు వర్గీకరణ అంశమే సాక్ష్యమన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్రానికి జగన్ విజ్ఞప్తి చేయలేదన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌కు కట్టుబడి ఉంటానని ఇడుపులపాయలో జగన్ హామీ ఇచ్చారన్నారు. దీంతో మాదిగలు ఓటు వేసి వైసీపీని గెలిపించారు. షెడ్యూల్ కులాల వర్గీకరణపై ఐదేళ్లలో వైసీపీ తీర్మానం చేయలేదని, అసెంబ్లీలో ఒక్క బిల్లు కూడా ప్రవేశపెట్టలేదని, ఢిల్లీ వెళ్లి పెద్దలను కలిసివచ్చినప్పుడు కూడా వర్గీకరణపై మాట్లాడింది లేదన్నారు. వర్గీకరణ అంశం కోర్టులో నడుస్తున్న సమయంలో వాదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం లాయర్‌ను కూడా నియమించకపో వడం దారుణమన్నారు. మాదిగలను జగన్ ప్రభుత్వం పక్కనపెట్టిందన్నారు. వర్గీకరణకు అనుగుణంగా ఉండను మీరు ఓటు వేస్తే వేయండి లేకపోతే లేదు అన్న చందంగా జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్సీ కులాల వర్గీకరణపై ఏ పార్టీ అనుకూలంగా ఉందో తెల్చుకుంటామన్నారు. జగన్, చంద్రబాబు, పవన్, బీజేపీలతోపాటు అన్ని ప్రధాన పార్టీల నాయకులను కలిసి వారి వైఖరిని తెలుసుకుంటామన్నారు. ఎస్సీ వర్గీకరణకు నిర్దిష్ట హామీఇచ్చి మేనిఫెస్టోలో పెట్టిన పార్టీకే మద్దతు ఇస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణతో సంబంధంలేదని మౌనం వహిస్తున్న వైసీపీఅయినా మరి ఏపార్టీ అయినా వ్యతిరేకిస్తామని కృష్ణమాదిగ చెప్పారు.

లారీలో రూ.9 లక్షలు విలువైన గంజాయి స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్ట్

రాజానగరం, ఫిబ్రవరి 23: ప్రయాణికుల ముసుగులో లారీలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులు మార్గమధ్యలో రాజానగరం పోలీసులకు చిక్కారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ రహదారిపై తూర్పుగోనగూడెంవద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో లారీలో గంజాయి తరలిస్తున్నట్టు ముందుగా అందిన సమాచారం మేరకు నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, సీఐ కె.కాశీవిశ్వనాథ్ పర్యవేక్షణలో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బీహార్‌కు చెందిన మహమ్మద్ మహఫ్రాజ్ అలం, కేరళకు చెందిన వడకల్ వలపిన్ రాజేష్‌కుమార్, ఏలూరు జిల్లా చేబ్రోలు గ్రామానికి చెందిన తాకాసి శివ అలియాస్ శివాజీ నర్సీపట్నం ఏజెన్సీ ప్రాంతం నుంచి 23.5 కిలోల గంజాయిని ప్రయాణికులు మాదిరిగా లారీ ఎక్కి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో తూర్పుగోనగూడెంవద్ద పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.9 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేసినట్టు చెప్పారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కాశీవిశ్వనాథ్



మాణిక్యాంబ సమేత భీమేశ్వరుడి రథోత్సవం

హరహర ధ్వానాలతో ..

భీమేశ్వరుడి రథోత్సవం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపుర మండలం ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణ మహోత్సవంలో భాగంగా భీమేశ్వర స్వామివారి రథోత్సవం శుక్రవారం భక్త కోలాహలంతో వైభవంగా జరిగింది. మధ్యాహ్నం కల్యాణమూర్తులైన మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామి వార్లను పుష్పాలంకృతమైన రథంపై అర్చకస్వాములు అధిష్టింప చేశారు. దూపసేవ అనంతరం 2.30 గంటలకు ఈవో పీటీవీ సత్యనారాయణ కొబ్బరికాయ కొట్టి రథోత్సవం ప్రారంభించారు. స్వామివారి రథం ఆలయంవద్ద నుంచి చంద్రవీధి గుండా వెలంపాలెం చేరుకుని సూర్యవీధి మీదుగా మెయిన్‌రోడ్డు చేరుకుంది. తదుపరి మార్కెట్, యానాం సెంటర్ నుంచి వేగాయమ్మపేట చేరుకుంది. రథంలో ఆశీనులైన కల్యాణమూర్తులు స్వామి, అమ్మవార్లను పుర వీధులలో భక్తులు దర్శించుకున్నారు.

ఘనంగా ఆస్థాన పూజ

రాత్రి 6.30కు ఆస్థాన మండపంలో కల్యాణమూర్తులకు ఆస్థాన పూజ జరిగింది. వేద స్వస్తి అనంతరం పూజలు నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పం కార్యక్రమంతో ఆస్థాన పూజ ముగిసింది. కార్యక్రమంలో వాడ్రేవు సుందరరత్నకరావు, ఆలయ ఈవో పి.టి.వి సత్యనారాయణ, ఆలయ సిబ్బంది, ఆలయ ఆస్థాన పండితులు దేవులపల్లి ఫణిరామకృష్ణ, అర్చకులు, వేదస్వస్తి వాచక బృందం, భక్తులు పాల్గొన్నారు. రథోత్సవం పురస్కరించుకుని రామచంద్రపురం సీఐ దొర రాజు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేంద్ర పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు విజయానంద్ ఆదేశాలతో సిబ్బంది విద్యుత్‌సరఫరా క్రమబద్ధీకరించి విద్యుత్‌కండక్టర్లు, వైర్లు తొలగించారు. రథోత్సవం అనంతరం పునరుద్ధరించే పని చేపట్టారు.

ఆర్మీ మాజీ మేజర్ మృతి

రావులపాలెం, ఫిబ్రవరి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన ఆర్మీ మాజీ మేజర్ నేకూరి మల్లేశ్వరరావు (84) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన సుదీర్ఘ కాలం మేజర్‌గా పని చేశారు. మల్లేశ్వరరావు మృతదేహాన్ని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సందర్శించి సంతాపం తెలిపారు.



నేకూరి మల్లేశ్వరరావు(ఫైల్)

వేడుకగా నరసన్న గ్రామోత్సవాలు

- అర్చకుల సమక్షంలో చోర సంవాదం వేడుకలు
- స్వామివారి చక్రస్నానానికి భారీ ఏర్పాట్లు



రాజాధిరాజా వాహనంపై ఊరేగుతున్న స్వామివారు



సముద్రం వద్ద చక్ర(జల్లు)స్నానం ఏర్పాట్లపై చర్చిస్తున్న ఏసీ సత్యనారాయణ, ఎస్ఐ రాము, రాజాబహదూర్

అంతర్వేది, ఫిబ్రవరి 23: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 4గంటలకు స్వామివారు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి రామరాజు, వెంకటసత్యనారాయణరాజులచే నిర్మితమైన రాజాధిరాజా వాహనంపై గ్రామపురవీధుల్లో ఊరేగారు. అనంతరం సాయంత్రం 6గంటలకు ధూపసేవ, 7గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లివారి కుటుంబీకులచే నిర్మితమైన అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, వనమాలి మూలాస్వామి, వలవల రాంబాబు భక్తులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయంలో చోర సంవాదం

అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారంరాత్రి 7.30గం టలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు ఉండపల్లి, బెల్లంకొండ కుటుంబీకులచే నిర్మితమైన అశ్వవాహనంపై స్వామివారిని 16మండపాల స్తంభం వద్దకు తీసుకువచ్చారు. ఆలయ అర్చకుల సమక్షంలో చోర సంవాదం వేడుకలు నిర్వహించారు. దారి దోపిడీ దొంగకు, భగవంతుని మధ్య జరిగిన సంభాషణను అర్చకులు తమిళంలో చదివారు. దారి దోపిడీ దొంగగా మారిన పరాకాలుడు అనే మహరాజు మారువేషంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహుడిని కూడా దోచుకుంటాడు. మహా విష్ణువు ఆయనను మంచివాడిగా చేసి ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేసిన పరకాలుడు పేరును తిరుమంగల్వార్‌గా మార్చి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తారు. ఈ సంభాషణను సున్నాలు, పన్నాలు పేరుతో వైష్ణవోపేతంగా ఆలయ స్థానాచార్యులు, వేద పండితులు, అర్చకులు పఠించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకట శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాముల సారధ్యంలో నిర్వహించారు.

నేడు స్వామివారికి చక్రస్నానం

అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ఉదయం శ్రీ స్వామివారికి చక్రస్నానం జరగనుంది. ఈసందర్భంగా రుద్రరాజు బంగారమ్మ బహూకరించిన గరుడ పుష్పక వాహనంపై స్వామివారి ఆలయంవద్ద నుంచి సముద్రంవద్దకు బయలుదేరి అనంతరం చక్రవారి అవబ్రుదోత్సవం సముద్ర స్నానం, వసంత మండపం వద్ద ప్రత్యేక పూజలు, అనంతరం ధ్వజారోహణ జరుగుతుంది. ప్రత్యేక బృందాలతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ, ఎస్ఐలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఆలయం వద్ద క్యూలైన్లు, సముద్ర స్నానాల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్టు ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. ఎటువంటి తొక్కిసలాట జరుగకుండా బారీ కేడ్లు ఏర్పాటు చేశామన్నారు. సముద్రంవద్ద సుమారు వంద మీ టర్ల మేర ప్రత్యేక కర్రలతో బారీకేడ్లు కట్టి స్వామివారి చక్రపెరుమాళ్ స్నానమాచరించే ప్రదేశంవద్ద ఏర్పాట్లు చేశారు. చక్రస్నా నం ఏర్పాట్లను ఏసీ సత్యనారాయణ పరిశీలించారు.

ప్రాచీన సుదర్శన పెరుమాళ్ స్వామి..

రాష్ట్రంలో మరెక్కడా లేనటువంటి ప్రాచీన సుదర్శన పెరుమాళ్ స్వామివారిని మాఘమాసంలో పౌర్ణమిరోజున భక్త లు శిరస్సుపై ఉంచుకుని సము ద్రస్నానం చేయడం మోక్షప్రదం, ముక్తిదాయకమని ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ తెలిపారు. స్వామివారి పంచబేరల్లో (ధ్రువ, కౌతుక, ఉత్సవ, స్నపన, బలిబేరం) బలిబేరం ఒకటి, చోడష బాడవులు, చోడష ఆయుధాలతో కూడిన ఈ విగ్రహం చుట్టూ జ్వాలలు వెనుక సుదర్శన యంత్రం కిందన గరుడ వాహనం ఉంటాయని తెలిపారు.



చక్రపెరుమాళ్



అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం దృశ్యం

నేడు గరుడ పుష్పక వాహనంపై గ్రామోత్సవం

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం తెల్లవారుజామున 3గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సుప్రభాతసేవ మొదలుకొని శ్రీస్వామివారి తిరువారాధాన, బాలభోగం, వార్షిక అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 8గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు రుద్రరాజు బంగారమ్మ వారిచే నిర్మితమైన గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుంది.

రేపు స్వామివారి తెప్పోత్సవం

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగం గా ప్రతి సంవత్సరం భీమవరానికి చెందిన గొట్టిముక్కల భీమరాజు తెప్పోత్సవానికి అయ్యే ఖర్చును విరాళంగా ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం సాయంత్రం దేవస్థానం చెరువులో మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణల నడుమ బాణసంచా కాల్పులతో హంస వాహనంపై స్వామివారి తెప్పో త్సవం జరుగుతుంది.

రెండు కార్లు ఢీ

- ఆరుగురికి తీవ్ర గాయాలు





ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు



ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 23: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖపట్టణం నుంచి విజయవాడ వెళుతున్న కారును కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడి వద్దకు వచ్చేసరికి ఎన్‌హెచ్16పై గల జ్యూస్‌ఫ్యాక్టరీ సమీపంలో ఐషర్ వ్యాను ఢీకొంది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్ దాటి ఏలేశ్వరం నుంచి గొల్లప్రోలు వెళుతున్న కారుని ఢీకొంది. ప్రమాదంలో గొల్లప్రోలు వస్తున్న కారులో ప్రయాణిస్తున్న మొయిళ్ల శ్రీనివాసరావు, మర్రి కృష్ణలకు, గుడాల లక్ష్మీ, శ్రీనివాసరావు, రాజారావు, శోభనలకు గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఉమ్మడి జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు

- ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రారు దుర్గాప్రసాద్ వెల్లడి

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23 : ఈనెల 25వ తేదీన కాకినాడ రెవెన్యూ భవన్‌లో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆల్ ఆంధ్రప్రదేశ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రారు, కోపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. దుర్గాప్రసాద్ వెల్లడించారు. ఈమేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఏపీజేఏసీ అమరావతి సభ్య సంఘమైన ఆల్ ఆంధ్రప్రదేశ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు తనను ఎన్నికల అధికారిగా నియమించారని తెలిపారు. అందువల్ల సంఘం నియమావళి ప్రకారం షెడ్యూల్ ప్రకటించామన్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 25వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి కాకినాడ కలెక్టరేట్ ఎదురుగా గల రెవెన్యూ భవన్‌లో ఎన్నికలు జరుగుతాయన్నారు. అందువల్ల సభ్యులందరూ ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు హాజరై సహకరించాలని ఎన్నికల అధికారి దుర్గాప్రసాద్ తెలియజేశారు.

పోలీసుల అదుపులో

ముగ్గురు దోపిడీ దొంగలు

నల్లజర్ల, ఫిబ్రవరి 23: నల్లజర్ల మండలం పోతవరం షుగర్ ఫ్యాక్టరీవద్ద దారి దోడిపీకి పాల్పడ్డ ఐదుగురు వ్యక్తుల్లో ముగ్గురు పోలీసులకు చిక్కారు. బుధవారంరాత్రి భీమవరం పట్టణానికి చెందిన నగల వ్యాపారి బాలు నాతురామ్ కారును సిని ఫక్కీలో రెక్కీ నిర్వహించి పోతవరం షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఐదుగురు వ్యక్తులు ఇన్నోవా కారులో వచ్చి ఇన్‌కామ్‌ట్యాక్స్ అధికారులమని బెదిరించి వారి వద్ద 3.5కిలోల బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదుతో పారిపోయారు. దోపిడీకి పాల్పడ్డ ఐదుగురిలో ముగ్గురిని కొవ్వూరు డీఎస్పీ రామారావు తమ సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కొంతమంది బంగారు షాపుల్లో పనిచేసే వారి సమాచారంతో ఈ కుట్రకు పాల్పడినట్లు తెలుస్తోంది. కారు లోపల అనుసంధానంగా నిర్మించిన లాకర్ తాళం యాజమాని బాలువద్ద ఉండగానే చోరీ ఏలా జరిగిందనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. దారి దోపిడీ ముఠాకు సమాచారం, సహకరించిన వారి వివరాలు సేకరిస్తున్నారు.

లక్కవరం రేంజ్‌లో

ఏపీ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి పర్యటన

మోతుగూడెం, ఫిబ్రవరి 23: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో లక్కవరం రేంజ్‌లో శుక్రవారం ఏపీ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి చిరంజీవిచౌదరి సుడిగాలి పర్యటన చేశారు. బేస్ క్యాంప్ వద్ద గొంది గూడెం బీట్‌లో 1962 టేకు ప్లాంటేషన్‌ను పరిశీలించి అ చెట్లు ఎంత పెరిగాయో ఫారెస్ట్ సిబ్బందితో కొలతలు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని అడవిలో మంటలు చెలరేగి కారుచిచ్చులపై అటవీ అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. లక్కవరం సబ్ డివిజన్ కార్యాలయంను సందర్శించి అక్కడ జరుగుతున్న విశ్రాంతి భవనం, రేంజ్ కార్యాలయం పనులను పరిశీలించారు. ఆయన వెంట సీసీఎఫ్ శ్రీనివాసరెడ్డి, డీఎఫ్‌వో పుష్ప సౌజన్య, లక్కవరం రేంజ్ నానాజీ, బీట్ ఆఫీసర్ వెంకట్ రాందాసు, ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.



చెట్లను పరిశీలిస్తున్న ఏపీ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి చిరంజీవి చౌదరి, కార్చిచ్చుపై సలహాలు, సూచనలు ఇస్తున్న దృశ్యం

రైలులో ప్రయాణికురాలికి అస్వస్థత

- సామర్లకోట రైల్వే అధికారుల సహాకారంతో వైద్యం అందజేత

సామర్లకోట, ఫిబ్రవరి 23: సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న సుమారు 57 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రయాణికురాలికి తీవ్ర అస్వస్థత కలగడంతో సామర్లకోట రైల్వే అధికారులకు సహచర ప్రయాణికులు సమాచారం అందివ్వడంతో సామర్లకోట రైల్వే పోలీసుల సహాయంతో సామర్లకోట స్టేషన్‌లోని సదరు ప్రయాణికురాలిని దింపి సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి వాహనంలో హుటాహుటిన తరలించారు. ఆసుపత్రి వైద్యులు వెంటనే వైద్యం అందివ్వడంతో కోలుకున్నారు శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనలో ప్రయాణీకురాలికి మెరుగైన వైద్యం అందించేందుకు అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందించేందుకు సహకరించిన రైల్వే అధికారులకు, రైల్వే పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



భీమేశ్వరుడి అన్నదానట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 23: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవస్థానం అన్నదానట్రస్టుకు శుక్రవారం రామచంద్రపురం మండలం తోటపేటకు చెందిప డా.పోతుల వీరవెంకట సత్యనారాయణ రూ.1.00116 విరాళం అందజేశారు. తోటపేటలో 35 ఏళ్లగా ప్రైవేటువైద్యుడిగా పనిచేస్తున్న సత్యనారాయణ సదరు విరాళం ఈవో పి.టి.వి. సత్యనారాయణకు అందజేశారు.



విరాళం అందజేస్తున్న వైద్యుడు సత్యనారాయణ

రేపు ఉచిత వైద్యశిబిరం

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 23: పిఠాపురం మండలం కోలంక గ్రామంలో జనసేన నియోజకవర్గ నేత, విష్ణు హాస్పటల్స్ అధినేత డాక్టర్ పిల్లా శ్రీధర్, దీపికల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందని వారు చెప్పారు. కోలంక పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమే

» టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల » వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న యనమల కృష్ణుడు

తునిరూరల్, ఫిబ్రవరి 23: రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు స్పష్టం చేశారు. మండలంలోని పి.వెంకటాపురం గ్రామంలో శుక్రవారం పెద్ద ఎత్తున వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరిన పప్పు నవీన్, గింజాల భద్రం, పప్పు నాగేశ్వరరావు, పప్పు అప్పన్న, పప్పు లోవరాజు, ఆవాల సూరిబాబు, పప్పు రాజు, పప్పు పాండురంగారావు, పప్పు చినరమణ, సిద్ద దొరబాబుతో పాటుగా పలు కుటుంబాలను కృష్ణుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతి ముఖ్యమంత్రిని రానున్నరోజుల్లో ఇంటికి పంపించాలని టీడీపీ, జనసేన ప్రజాప్రభుత్వ ఏర్పాటుకు కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత పోల్నాటి శేషగిరిరావు, తుని పట్టణాధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ మోతుకూరి వెంకటేష్, అప్పన రమేష్, వంగలపూడి శ్రీనివాస్, గొల్లపల్లి రాంబాబు, గొల్లపల్లి నూకరాజు పాల్గొన్నారు.

జగ్గంపేటలో...

జగ్గంపేట, ఫిబ్రవరి 23: జగ్గంపేట సత్యవేణి పేటకు చెందిన వైసీపీకి చెందిన మోరుకుర్తి రాజు, ఈడిశెట్టి కొండ, లోడగళ్ళ రాంబాబు, వైబోగుల బాబ్జి తదితర సుమారు 100 కుటుంబాలు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రూ.10 ఇచ్చి రూ.100 వసూలు చేస్తున్న వైసీపీ పాలనకు చమరగీతం పాడడానికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పడానికి ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్తకొండ బాబు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, వైబోగుల కొండబాబుయాదవ్, కంచుమర్తి రాఘవ, దాపర్తి సీతారామయ్య, కుంచే తాతాజీ, పిలా మహేష్, నేదూరి గణేష్, డేగల సత్తిబాబు, కురుమళ్ళ నాగేశ్వరరావు, ఎస్వీ ప్రసాద్, వెలిశెట్టి బుజ్జి, సాంబత్తుల చంద్రశేఖర్, పాలచర్ల సత్యనారాయణ, నండ్ల చిరంజీవి, నంగిరెడ్డి రమేష్ తదితరులున్నారు.



జగ్గంపేట: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నెహ్రూ



ప్రత్తిపాడు : టీడీపీలో చేరినవారితో సత్యప్రభ

పెదశంకర్లపూడిలో...

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 23: ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయిబ్రాహ్మణ సంఘాల కార్యకర్తలు టీడీపీలో చేరారు. మండలంలోని పెదశంకర్లపూడి గ్రామంలో పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా సమక్షంలో వారందరు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. నాయిబ్రాహ్మణ సంఘాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని సత్యప్రభ తెలిపారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మండల నాయిబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు కాకినాడ ప్రసాద్, పెద్దశంకర్లపూడి, చినశంకర్లపూడి, పోతులూరు, లంపకల గ్రామాల నాయిబ్రాహ్మణ సంఘాల అధ్యక్షులు యండమూరి రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, ఆర్.బుచ్చిబాబు, సానపల్లి నాగేశ్వరరావు నియోజకవర్గ నాయిబ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యులు నెల్లిపాక నాగ సత్యనారాయణ, కోసూరి అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాపురోగతి లేకుంటే చర్యలు తప్పవు : డీఈవో

సామర్లకోట, ఫిబ్రవరి 23: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నందున తరగతి గదుల్లో విదార్థుల్లో విద్యాపురోగతి లేకుంటే సంబంధిత ప్రధానోపాధ్యాయులపై చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి పీ.రమేష్ హెచ్చరించారు. శుక్రవారం సామర్లకోట మండలం అచ్చంపేట మండల పరిషత్ పాఠశాల, నవర జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించారు. తరగతులలో విద్యార్థుల మేధస్సును పరిశీలించిన డీఈవో అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిస్థితి మరింత మెరుగవ్వాలని ఎంఈవో పి.పుల్లయ్యను ఆదేశించారు. ఫిబ్రవరి సిలబస్ అనుగుణంగా పూర్తిచేయాలన్నారు. ప్రతీ పాటశాలలోనూ మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేసే బాధ్యత హెచ్ఎంలదేనన్నారు. నాడు-నేడు పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందున త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో పుల్లయ్య, హెచ్ఎంలు శ్రీనివాస్, సత్యవతిలు తదితరులు ఉన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలతో వైసీపీ అడ్రస్ గల్లంతు'



బాండ్లు అందజేస్తున్న శ్రీనివాస్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23: తెలుగుదేశం-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో వైసీపీ అడ్రస్ గల్లంతు అవడం ఖాయమని టీడీపీ నాయకుడు, 36వ డివిజన్ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ.. కార్యక్రమం డివిజన్‌లో 30 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం పలు వర్గాలకు బాండ్లు పంపిణీ చేశారు. బూత్ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నల్లూరి మాట్లాడుతూ ఎన్నికల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. త్వరలో వైసీపీ ఫ్యాను రెక్కలు విరిగి ముక్కలు అవుతాయని, టీడీపీ-జనసేన కలయికలో కొత్త ప్రభుత్వం రావడం తథ్యమని దీమా వ్యక్తం చేశారు.

సూపర్ సిక్స్ పథకాల పోస్టర్ ఆవిష్కరణ

టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ.. సూపర్ సిక్స్ పథకాల పోస్టర్‌ను కాకినాడ జిల్లా తెలుగు మహిళాధ్యక్షురాలు సుంకర పావని ఆవిష్కరించారు. పోస్టర్లు, హోర్డింగ్‌లు, ప్రచార మాధ్యమాల ద్వారా ఈ పథకాలపై ప్రచారం చేపట్టామని తెలిపారు. తెలుగు మహిళలు పాల్గొన్నారు.

'పాత పెన్షన్ విధానాన్ని మేనిఫెస్టోలో చేర్చాలి'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 23: జీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ఉద్యోగులకు అమలు చేసేలా జనసేన ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చేలా పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని ఏపీ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్.ప్రసాద్ కోరారు. శుక్రవారం వలసపాకల జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీకి వినతి పత్రం అందించారు. ఉపాధ్యాయులు సూచించిన విషయాలను పవన్ దృష్టికి తీసుకెళ్తానని నానాజీ ఉపాధ్యాయ సంఘాల నాయకులకు హామీ ఇచ్చారు. వాకలపూడికి చెందిన సుమారు 60 మంది గ్రామ పెద్దలు, యువకులు జనసేనలో చేరగా వారికి నానాజీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. గంటా ప్రసాద్, గేదెల చిన్నారావు, కరెడ్ల గోవింద్, ఓసుపల్లి శివాజీ, ప్రసాద్, ధనుష్, టీడీపీ నేతలు మాతా లక్ష్మణ్, చొక్కా జగన్ పాల్గొన్నారు.

'పేదల ఇళ్ల స్థలాలపై రాజకీయాలు చేయవద్దు'

తాళ్లరేవు, ఫిబ్రవరి 23: పేదల ఇళ్ల స్థలాలపై ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, వైసీపీ నేతలు రాజకీయాలు చేయవద్దని, రాబోవు రోజుల్లో మూల్యం చెల్లించాల్సి ఉంటుందని తాళ్లరేవు మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి అన్నారు. శుక్రవారం 24వ రోజు చొల్లంగి ఇళ్ల స్థల లబ్ధిదారుల నిరసనకు దీక్షలకు ఎమ్‌డియుడబ్ల్యుఏ సభ్యులు మద్దతు తెలిపారు. జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు జక్కుల ప్రసాద్‌బాబు, కార్యదర్శి దున్నా సుబ్రహ్మణ్యం, మోర్త భైరవమూర్తి, దున్నా మురళీకృష్ణ, టీడీపీ మండల కార్యదర్శి కాట్నా త్రిమూర్తులు ఉన్నారు.

మహా రుద్రాభిషేకానికి ఆహ్వానం

గండేపల్లి, ఫిబ్రవరి 23: జగ్గంపేట మండలం ఇర్రిపాకలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ కుటుంబ సభ్యులు ఈ నెల 26నుంచి మార్చి7వ తేదీ వరకు చేపట్టే మహా రుద్రాభిషేకానికి వచ్చి స్వామివారి ఆశీస్సులు తీసుకోవాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, యువ నాయకులు జాస్తి వసంత్, అడబాల ఆంజనేయులు శుక్రవారం రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజమండ్రిరూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీ ఛైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన నేతలు బత్తుల బలరామకృష్ణ, కందుల దుర్గేష్, కోనేరు మురళి, పోలిశెట్టి చంద్రశేఖర్, వేగుళ్ళ లీలాకృష్ణకు ఆహ్వానపత్రికలు అందజేశారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లి త్రిమూర్తులు మల్లేపల్లిలో పంపిణీ చేశారు.

కాకినాడలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23: సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడలో నిర్వహించిన జాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు హాజరయ్యారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సానా సతీష్‌బాబు బెంగుళూరుకు చెందిన సాఫ్ట్ వేగ్ సంస్థ ప్రోక్సెలేరా ప్రతినిధులను సంప్రదించి ఈ జాబ్ మేళా ఏర్పాటు చేయించారు. 2 రోజుల పాటు నిర్వహించనున్న ఈ జాబ్ మేళా తొలిరోజు 280 మంది రాత పరీక్షకు హాజరుకాగా ఇంటర్వ్యూలు ద్వారా పలువురుని ఎంపిక చేశారు. రెండోరోజు రాత పరీక్షలు,ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసినవారికి నియామక పత్రాలు అందిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రోక్సెలేరా సంస్థ సీఈవో మోహన్ రాఘవేంద్ర, వైస్ ప్రెసిడెంట్ కె.గురుప్రసాద్, డైరెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో 2కె24 మేనేజ్‌మెంట్ ఫెస్ట్

గండేపల్లి, ఫిబ్రవరి 23: సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో అదిత్ 2కె24 మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ప్రారంభమైందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ స్ట్రాటజీ, గ్రోత్ విలైస్పైర్డ్ సొల్యూషన్స్ హెడ్ త్రివిక్రమ్ పొట్లూరి హెడ్ విచ్చేశారు. మొదటిరోజు ఫైనాన్స్, మార్కెటింగ్, మానవవనరులు, బిజినెస్ ప్లాన్ యంగ్ మేనేజర్ బిజినెస్ క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సంజయ్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.విజయభార్గవి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఎం.గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


ఆనంద నిలయ భవనం ప్రారంభం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 23: ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాకినాడలో నిరుపేదల కోసం నిర్వహిస్తున్న ఆనంద నిలయం శిథిలావస్థకు చేరింది. నూతన భవనం కోసం నిధులు కేటాయించాలని కలెక్టర్ విజ్ఞప్తి మేరకు కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ. 15 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో ఆనంద నిలయంలో 60 మంది విద్యార్థులకు నివాస యోగ్యంగా ఉండేలా కొత్త వసతి భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. కొత్త భవనం నిర్మించిన కంపెనీ యాజమాన్యానికి విద్యార్థులు, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి, సంక్షేమానికి సహకారం అందిస్తామని కోరమండల్ సంస్థ అధికారులు తెలిపారు.

జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శిగా జయకృష్ణ

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 23: జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శిగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన సూరిశెట్టి జయకృష్ణ నియమితులయ్యారు. తనను ఈ పదవిలో నియమించినందుకు జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌కు జయకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

కుంతీమాధవుని రథోత్సవం



స్వామివారి రథం

పిఠాపురం, ఫిబ్రవరి 23: పిఠాపురం కుంతీమాధవుని రథోత్సవం శుక్రవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. రథోత్సవాన్ని ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ ప్రారంభించారు. ఉప్పాడ సెంటర్ వద్ద రథంలో ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకున్నారు. బాణాసంచా కాల్చారు. స్వామిని మాజీ ఎమ్మెల్యే వర్మ దర్శించుకున్నారు. ఆలయ ఈవో నున్న శ్రీరాములు, ప్రజాప్రతినిధులు, భక్తబృందం సభ్యులు ఉన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: సుందరంమాస్టర్, భ్రమయుగం, ముఖ్య గమనిక, మస్త్ షేడ్స్ ఉన్నాయిరా, అంబాజీపేట మ్యారేజీబ్యాండు, రాజధాని ఫైల్స్, గుంటూరు కారం

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: సుందరంమాస్టర్, భ్రమయుగం, రాజధాని ఫైల్స్, డ్రిల్, ఊరుపేరు భైరవకోన, మస్త్ షేడ్స్ ఉన్నాయిరా

తిరుమల: సూర్యసనఃకృష్ణన్, అంబాజీపేట మ్యారేజీబ్యాండు

లక్ష్మి	:	ఒక్కడు
సీ అండ్‌సీ1	:	సిద్ధార్థరాయ్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	ఊరు పేరు భైరవకోన
పద్మప్రియ	:	సుందరంమాస్టర్
సత్యగౌరి	:	ఊరు పేరు భైరవకోన
సూర్య 1	:	సిద్ధార్థరాయ్
సూర్య 2	:	ఊరు పేరు భైరవకోన

నేడు ఉప్పాడలో పుణ్యస్నానాలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 23: మాఘపౌర్ణమి సందర్భంగా శనివారం ఉప్పాడ రేవులో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. పిఠాపురం నుంచి శ్రీ కుంతీమాధవస్వామి(దొంగదేముడు)ని పల్లకీలో ఊరేగించుకుంటూ ఉప్పాడ సముద్రతీరానికి తీసుకొచ్చి చక్రస్నానం చేయిస్తారు. పూర్తికాగానే భక్తులు స్నానాలు ఆచరిస్తారు. మాఘపౌర్ణమి స్నానాలచరించిన మహిళల సౌకర్యార్థం సముద్రం ఒడ్డునుటెంట్‌లు ఏర్పాటు చేసినట్టు పంచాయతీ కార్యదర్శి అన్నారు.

'అభ్యర్థుల విజయానికి కృషి'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 23: రాబోయే ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఎవరికి టిక్కెట్ కేటాయించిన అధిష్ఠానం ఆదేశాల మేరకు అభ్యర్థుల విజయానికి శాయశక్తులా కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి తెలిపారు. శుక్రవారం వలసపాకల్లో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఏర్పడిన రాజకీయ అనిశ్చితితో ఇన్‌చార్జి లేక, పార్టీ కేడర్‌లో సమన్వయ లేమి నెలకొందన్నారు. దీనిని చక్కదిద్దాల్సిన బాధ్యత పార్టీపై ఉందన్నారు. పొత్తులో అధిష్ఠానం టిక్కెట్ ఎవరికిచ్చినా వారి విజయానికి కృషి చేస్తానన్నారు. టిక్కెట్ విషయం తేలకుండానే మిత్రపక్షమైన జనసేన కార్యాలయం ప్రారంభించడం, టిక్కెట్ తమకే వచ్చేసిందన్న ప్రచారంతో బీసీ నాయకులు సమావేశంలో అసహనం వ్యక్తం చేశారన్నారు. ఈ విషయం తెలిసి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితి రాకుండా, బేధాభిప్రాయాలు వ్యక్తం చేయకుండా మంచి సుహృద్భావ వాతావరణం కలిగించేందుకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ బుంగా సింహాద్రి, మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, బుజ్జి తదితర నాయకులు ఉన్నారు.

'చంద్రబాబుతోనే మహిళలకు రక్షణ'

శంఖవరం, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో మహిళలకు సాధికారత రావాలంటే చంద్రబాబు ప్రభుత్వం రావాలని, చంద్రబాబుతోనే మహిళలకు రక్షణ ఉంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభరాజా అన్నారు. శుక్రవారం టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా శివ ఆధ్వర్యంలో కత్తిపూడిలో మీ కోసం- మీఇంటికి మీసత్యప్రభ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మహిళలకు టీడీపీ, జనసేన ప్రభుత్వంలో అమలుచేసే పథకాలను వివరించారు. సీనియర్ టీడీపీ నేత పర్వత సురేష్, మండలాధ్యక్షుడు బద్ది రామారావు, కంచిబోయిన శ్రీను, బచ్చల గంగ, ఉల్లి వీరభద్రరావు, నియోజకవర్గ యువత అధ్యక్షుడు కీర్తి వెంకటసుబాష్, జనసేన నాయకులు యర్రంశెట్టి బాబ్జీ, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, ఇందన సత్తివీర్రాజు,కేశంగి జనార్ధన్ ఉన్నారు.

'జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 23: జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించే విధంగా జనసేన, టీడీపీ కార్యకర్తలు నడుం బిగించాలని జనసేన పార్టీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు కోరారు. మండలంలోని ధర్మవరంలో శుక్రవారం జనసేన ముఖ్య నాయకులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనను సాగనంపేరోజులు దగ్గపడ్డాయన్నారు. జనసేన, టీడీపీ మొదటి ఎన్నికల ప్రచార సభ ఈ నెల 28న తాడేపల్లి నియోజకవర్గంలోని ప్రత్తిపాడు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంవ్యాప్తంగా జనసైనికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి దాసం శేషారావు, ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాధ్యక్షులు పెంటకోట మోహన్, రామకుర్తి కామేష్ తదితరులు పాల్గొన్నారు.

'బ్లాక్‌లో మద్యం అమ్ముకుంటున్నారు'

రౌతులపూడి, ఫిబ్రవరి 23: ఎస్.పైడిపాలలో వైసీపీ నేతలే బ్లాక్‌లో ప్రభుత్వ మద్యం అమ్ముకుంటున్నారని టీడీపీ నేతలు, మాజీ సర్పంచ్‌లు గొల్లు పెద్దదివాణం, ఈగల సత్తిబాబు ఓ ప్రకటనలో ఆరోపించారు. టీడీపీ కార్యకర్త మద్యం అమ్ముతూ పట్టుపడ్డాడని ఓ పత్రికలో వచ్చిన వార్త నిజం కాదన్నారు. రాజులుబాబు పండుగకు స్నేహితులకు పార్టీ ఇచ్చేందుకు రౌతులపూడిలో ప్రభుత్వ దుకాణం నుంచి కొనుగోలు చేశారన్నారు. వైసీపీ వాళ్ల దగ్గర బ్లాక్‌లో అమ్ముతున్న మద్యం కొనుగోలు చేయలేదనే కక్షతో పట్టించారని చెప్పారు.

రేపు రాష్ట్ర స్థాయి బహిరంగ సభ

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 23: జాతీయ మాలమహానాడు నేతృత్వంలో భారత రాజ్యాంగమే దళితుల ఎజెండా అనే అంశంపై రాష్ట్ర స్థాయి బహిరంగ సభను ఆదివారం కాకినాడలో నిర్వహిస్తున్నట్టు ఆంధ్రా మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్దాంతుల కొండబాబు తెలిపారు. శుక్రవారం సూర్యకళా మందిర్ ఆవరణలో జాతీయ మాలమహానాడు ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్ తదితరులతో కలిసి కొండలబాబు విలేకర్లతో మాట్లాడుతూ ఈ సభకు ముఖ్య అతిథులుగా జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ జి.హర్షకుమార్, మాలమహానాడు జాతీయ నాయకులు మల్లెల వెంకట్రావు, ఎంపికె. భీమారావు, గోళ్ల అరుణ్‌కుమార్ హాజరవుతారని తెలిపారు.

దుర్గాడలో కలశాల ప్రదర్శన

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 23: దుర్గాడలో నూతనంగా నిర్మించిన బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వరపూజ, గర్త, ధాతు, బీజన్యాసములు, గోపూజ, ప్రధాన హోమాలు, పంచశయ్యాది వాసం జరిగా యి. అనంతరం మహిళలు కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పురవీధుల గుండా జరిగిన కలశాల ప్రదర్శనకు భక్తులు భారీగా తరలివచ్చారు.



నిధులు తీసుకురాలేకపోయిన ఎంపీ, ఎమ్మెల్యే

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



పిఠాపురంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, ఫిబ్రవరి 23: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం తెచ్చిన నిధులు తప్ప గత ఐదేళ్లలో ఎంపీ, ఎమ్మెల్యేలు ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేకపోయారని మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని కులాలకు సమాన ప్రాధాన్యమివ్వాలని భావించి కాపు, బీసీ, ఎస్సీ, ముస్లిం, మైనార్టీ, వైశ్య బ్రాహ్మణ తదితర కులాలకు కల్యాణమండపాల నిర్మాణం నిమిత్తం నిధులు మంజూరు చేయడమే గాక కోట్లాది రూపాయిలు విలువైన స్థలాలు కేటాయించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 27 కాపు కల్యాణ మండపాలకు నిధులు మంజూరు చేయించామని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ పనులు ముందుకు కదలకపోగా, నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు ఇప్పటి వరకూ కల్యాణమండపాలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. పదేళ్ల పాటు నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా వదిలివేసిన ఎంపీ గీత ఇప్పుడు వచ్చి కల్లుబొల్లి కబుర్లు చెబితే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని తెలిపారు. ఎన్నికల ముందు కల్యాణమండపాల కోసం కేటాయించిన స్థలాలు చదును చేసి, శిలాఫలకాలు పగుల కొట్టి తామే ఏదో చేస్తున్నట్లు కలరింగ్ ఇవ్వడం కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనని చెప్పారు. పొన్నూరు నాయకుల మాటలు నమ్మవద్దని, వీరు నెగ్గితేనే నియోజకవర్గానికి వస్తారని, లేకుండా కనిపించరని తెలిపారు. తాను మాత్రమే స్థానికుడినని, ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడు అండగా ఉన్నానని చెప్పారు. సమావేశంలో టీడీపీకి చెందిన వివిధ సామాజిక వర్గాల నాయకులు ఉన్నారు.

సెక్టోరియల్ అధికారుల పాత్ర ఎంతో కీలకం

ఆర్డీవో సీతారామారావు



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో

పెద్దాపురం, ఫిబ్రవరి 23: రానున్న ఎన్నికల విధుల్లో సెక్టోరియల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమైనదని ఆర్డీవో జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం సెక్టోరియల్ అధికారులకు ఎన్నికల విధుల నిర్వహణపై శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారుల సమర్థవంతగా విధులు నిర్వహించి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతీ విషయంపై అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎన్నికల సమయంలో బాధ్యాతాయుతంగా ఉండాలని, ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. సెక్టోరియల్ అధికారుల పరిధిలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పించాలని ఆదేశించారు. ఈవీఎంలు, వీవీప్యాట్లు హ్యాండ్ బుక్, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు పోలింగ్ కేంద్రాల్లో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. హ్యాండ్ బుక్‌లోని ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా చదివి తెలుసుకోవాలన్నారు. ఎన్నికల రోజు సిబ్బందికి తగు సూచనలు చేయలన్నారు. పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు. అనంతరం పలు విషయాలపై మాస్టర్ ట్రైనీలు సెక్టోరియల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ లతాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి రాజకీయ సమాధి కట్టాలి : యనమల దివ్య



భీమవరపుకోటలో ప్రచారం చేస్తున్న దివ్య

కోటనందూరు, ఫిబ్రవరి 23: వైసీపీకి రాజకీయ సమాధి కట్టే సమయం వచ్చిందని తుని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. శుక్రవారం మండలంలోని భీమవరపుకోట గ్రామంలో మాజీ జడ్పీటీసీ పెంటకోట భాస్కరసత్యనారాయణ ఆధ్వర్యంలో మీఇంటికి మీ దివ్య కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ రాష్ట్రం రావణ కష్టం అవుతుందన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారని, అంతా అవినీతి దోపిడితోనే పరిపాలన సాగుతుందన్నారు. టీడీపీ కార్యకర్తలు, జర్నలిస్టులపై దాడులు చేయడం పనిగా పెట్టుకున్నారని, అందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. కార్యక్రమంలో యనమల శివరామకృష్ణన్, డి.చిరంజీవిరాజు, మోతుకూరి వెంకటేష్, మేరపురెడ్డి జోగిబాబు, పోతల సూరిబాబు, అంకంరెడ్డి రమేష్, అంకంరెడ్డి నానబ్బాయి షేక్‌నవాబ్‌జానీ, లెక్కలభాస్కర్, యర్ర చినసత్యనారాయణ, బైలపూడి శ్రీరామమూర్తి, గాది రాము అల్లంపల్లి నర్సింహమూర్తి తదితరులు ఉన్నారు.

'ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 23: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ ఎన్వీవీ.సత్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం కాకినాడ రూరల్ నేమాం-3 లేఅవుట్‌లో నిర్మాణంలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ లేఅవుట్‌లో 10 గ్రామాలకు చెందిన 3223 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలివ్వగా, 1754 ఇళ్లు మంజూరు చేశామన్నారు. 1100 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. వేసవి కాలం ఇళ్ల నిర్మాణానికి అనువుగా ఉంటుందని, మిగతా ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టేలా లబ్ధిదారులతో మాట్లాడి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు గ్రాంటుగా ఇస్తోందని, డ్వాక్రా నుంచి మరో రూ.30వేలు లోన్‌గా అందిస్తోందన్నారు. కాలనీల్లో పూర్తిస్థాయిలో రోడ్లు, విద్యుత్తు, తాగునీరు వంటి మౌళిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. బిల్లుల చెల్లింపు, అధికారుల సహకారం, మౌళిక సదుపాయాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల హౌసింగ్ ఏఈ కె. నాగభూషణం, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

'బర్తరఫ్ చేయాలి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23: వలంటీర్లే తమ కార్యకర్తలని.. రాబోయే ఎన్నికల్లో వలంటీర్లను వాడుకుంటామని బహిరంగ సభల్లో రాష్ట్ర మంత్రులు ప్రకటిస్తున్న వ్యాఖ్యలను రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘం సుమోటోగా తీసుకుని వారిని బర్తరఫ్ చేయాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షుడు ఎంఏ తాజుద్దీన్ కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల్లో వలంటీర్లను వాడుకుంటే ఓటర్లపై ప్రభావం పడే అవకాశ ముందన్నారు. జగన్‌రెడ్డి అక్రమ ఆస్తులపై సీబీఐ నమోదు చేసిన కేసులపై ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ పూర్తి చేయాలన్నారు.

పేదలకు భోజనం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23: నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ద్వారా కాకినాడ పెద్దమార్కెట్ ఏరియాలో నిర్వహిస్తున్న అన్న ఎన్టీఆర్ జనార్ధన్ క్యారేజీలో శుక్రవారం 650వ రోజు పేదలకు భోజన వితరణ చేశారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ప్రత్యేక కేక్ కట్ చేసి పంచారు. ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరాం వర్మ ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేశారు.

వైభవంగా చండీహోమం



పెద్దాపురంలో హోమం నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం, ఫిబ్రవరి 23: స్థానిక మరిడమ్మవారి దేవస్థానంలో చండీహోమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి 700 శ్లోకాలతో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు పర్యవేక్షణలో అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు చేశారు. ప్రజలకు సకల శుభాలు, కార్యాలు నెరవేర్చేందుకు ఈ చండీహోమం నిర్వహించడం జరుగుతుందని పండితులు తెలిపారు. హోమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు, అమ్మవారికి పుష్పపూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు, ఫౌడర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

అన్నవరంలో...



అన్నవరం, ఫిబ్రవరి 23: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రగ్బీ పోటీల్లో ప్రతిభ



మనోజ్ఞలక్ష్మిని అభినందిస్తున్న డీఈవో రమేష్

పిఠాపురం, ఫిబ్రవరి 23: పట్టణంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని పి.మనోజ్ఞ లక్ష్మీ విశాఖలో రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. గుజరాత్‌లో జరిగిన జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చూపడం ద్వారా ప్రత్యేక బహుమతి గెలుపొందారు. మనోజ్ఞలక్ష్మిని డీఈవో రమేష్ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జేడీ రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు, పీడీ శేషుకుమారి, పీఈటీలు ఎలిఫే సునీల్‌దేశాయి, డి.సత్యప్రియలు అభినందించారు.

బాలల హక్కులపై అవగాహన

పెద్దాపురం, ఫిబ్రవరి 23: బాల పరిరక్షణ విభాగం, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక స్త్రీశక్తి భవనంలో బాలల హక్కులు, పరిరక్షణ తదితర విషయాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏపీఎం పి.సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంస్థాగత సేవలు, కిషోర బాలికల అభివృద్ధి, బాల్య వివాహాలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 23: పీసీసీ చీఫ్ షర్మిలరెడ్డిని విజయవాడలో అరెస్ట్ చేయడం దారుణమని, అరెస్ట్‌కు నిరసనగా ప్రత్తిపాడు అంబేడ్కర్ కళామందిర్ వద్ద పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో శుక్రవారం ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలో నిరుద్యోగంతో పాటు అనేక ప్రధాన సమస్యలపై విపక్షాలు చేస్తున్న ఆందోళనను అణచివేయాలని చూడడం దారుణమన్నారు. ఈరుగుల చక్రం, కందిమళ్ళ శామ్యూల్, మాదేమోసే తదితరులు పాల్గొన్నారు.

28న రైల్వే గేటు మూసివేత

సామర్లకోట, ఫిబ్రవరి 23: సామర్లకోట-పిఠాపురం ట్రాక్‌లో ఉత్తర క్యాబిన్ వద్ద రైల్వే గేట్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 28 ఉదయం 7 గంటల నుంచి మార్చి 6 సాయంత్రం 7 గంటల వరకూ మూసివేస్తామని, వాహనదారులు గమనించాలని సామర్లకోట రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ పబ్లిక్ వే బీవీ.రామసుబ్బారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

150 లీటర్ల సారా స్వాధీనం

తొండంగి, ఫిబ్రవరి 23: వేమవరం పంపాది పేట వద్ద సారా బట్టీపై దాడి జరిపి 150 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వినయ్‌ప్రతాప్ తెలిపారు. సారా కాస్తున్న మైలపల్లి సత్తిబాబును అదుపులోకి తీసుకున్నామన్నారు. బట్టీ నిర్వాహకులు గోసాల దండు,గోసాల శ్రీను పరారీలో ఉన్నారు. దీంతో పాటు 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 23: పట్టణంలో నియోజకవర్గ బీజేపీ కార్యాలయాన్ని శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొల్లా శ్రీనివాస్, రెడ్డి లోవరాజు, గట్టిం వెంకటరమణ పాల్గొన్నారు.